

సీటీ రవిని అరెస్టు చేస్తున్న పోలీసులు

మంత్రి ప్రియాంక ఖర్గే ఇంటి ముట్టడికి బీజేపీ యత్నం

- నాయకుల అరెస్టు

8



బెంగళూరు నగరంలోని బ్రిగేడ్ రోడ్డులో సంబరాలు



సంబరాల్లో విదేశీయులు..



2025కు చిన్నారి స్వాగతం(ఇన్‌సెట్లో)..ఎంజీ రోడ్డులో సందడి

ఆశలతో.. ఆహ్వానం

- కొత్త ఏడాదికి ఘనంగా స్వాగతం
- ఎంజీ రోడ్డులో యువత కేరింతలు
- రాష్ట్రమంతటా సందడే సందడి...
- విశ్రాంతి, విహారంలో అగ్రనేతలు

బెంగళూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): కొత్త ఏడాదికి కోటి ఆశలతో ఘన స్వాగతం పలికారు. ఏడాది ముగింపు వేడుకలు రాష్ట్రమంతటా ఉత్సాహంగా సాగాయి. మంగళవారం మధ్యాహ్నం నుంచే ముగింపు వేడుకలకు ముస్తాబైంది. రాష్ట్ర వ్యాప్తంగా హోటళ్లు, రెస్టారెంట్‌లు, పబ్‌లు, రిసార్టులలో ప్రత్యేక కార్యక్రమాలు సాయంత్రం 5గంటలకు ప్రారంభమయ్యాయి. ప్రధానంగా బెంగళూరు, మైసూరు, మండ్య, చామరాజనగర ప్రాంతాల్లోని వందలాది రిసార్టులలో సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. తీరప్రాంత జిల్లాలు ఉత్తరకన్నడ, దక్షిణకన్నడ, ఉడుపి జిల్లాల్లో బీచ్‌ల వద్ద భారీ బందోబస్తు కల్పించారు. సాయంత్రం 7 గంటలనుంచి ఎటుచూసినా రద్దీ ప్రారంభమైంది. బెళగావి, బాగల్కోటె, విజయపుర, కొడగు, చిక్కమగళూరు, శివమొగ్గ, హాసన్ జిల్లాల్లోని హోటళ్లు, ఇతరత్రా ప్రాంతాలలో కార్యక్రమాలు కొనసాగాయి. బెంగళూరులోని ప్రధానమైన ఎంజీ రోడ్డు, చర్చ్‌స్ట్రీట్, బ్రిగేడ్‌రోడ్డు ప్రాంతాలకు సాయంత్రం 6 గంటలనుంచి వాహనాల రాకపోకలను నిలిపివేశారు. గత రెండుమూడేళ్లతో పోలిస్తే భారీగా జనం చేరారు. రాత్రి 10 గంటలనుంచి యువత కేరింతలు ప్రత్యేకంగా అనిపించాయి. సందడిలో యువత అసభ్యకరంగా ప్రవర్తించేందుకు ప్రయత్నించగా పోలీసులు కట్టడి చేశారు. నగర పరిధిలో 11వేలమంది పోలీసులను బందోబస్తుకోసం కేటాయించారు. ఎంజీ, బ్రిగేడ్ రోడ్లలో ఏకంగా వెయ్యికిపైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరంగా కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షణ సాగించారు. నగరమంతటా కొత్త సంవత్సరాన్ని స్వాగతించేందుకు ప్రజలు ప్రత్యేక ఉత్సాహం చూపారు. 12 గంటలు కాగానే హ్యాపీ న్యూ ఇయర్ అంటూ బాణా సంచాపేల్చి సంబరాలు చేసుకున్నారు. ఒకరినొకరు శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. నగర వ్యాప్తంగా ఫ్లై ఓవర్‌లు మూసివేయడంతో పలుచోట్ల ట్రాఫిక్ స్తంభించింది.

విశ్రాంతి, విహారంలో అగ్రనేతలు

కొత్తసంవత్సర వేడుకల వేళ అగ్రనేతలు విశ్రాంతి, విహారంలో మునిగితేలారు. సీఎం సిద్దరామయ్య నాలుగురోజులపాటు అందుబాటులో ఉండనని ప్రకటించారు. ఆయన విశ్రాంతి తీసుకుంటున్నట్లు సీఎంఓ తెలిపింది. మూడు రోజులుగా ముఖ్యమంత్రి ఏ కార్యక్రమంలోనూ పాల్గొనలేదు. కొత్త సంవత్సరం ప్రారంభంలోనూ సీఎం కనిపించలేదు. డీసీఎం డీకే శివకుమార్ కుటుంబ సభ్యులతోపాటు కెనడా, టర్కీ పర్యటనకు మంగళవారం ఉదయం బయల్దేరి వెళ్లారు. ఇక బీజేపీ అగ్రనేత యడియూరప్ప కుటుంబ సభ్యులతోపాటు విదేశాలకు వెళ్లారు. జేడీఎస్ కీలకనేత, కేంద్రమంత్రి కుమారస్వామి కుటుంబ సభ్యులతో కలసి గోవాకు వెళ్లారు.

ఐఏఎస్, ఐపీఎస్‌లకు ఉద్యోగోన్నతులు

బెంగళూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఏడాది ఆఖరున ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లకు పదోన్నతులు కల్పిస్తూ రాష్ట్రప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. 65మంది ఐఏఎస్‌లు, 69మంది ఐపీఎస్‌లు, 23మంది ఐఎఫ్ఎస్‌లకు పదోన్నతులు కల్పించారు. డీపీఏఆర్ వివిధశాఖల కార్యదర్శులు జారీ చేశారు.

పంచనామాకు అనుమతులు ఇవ్వలేదు: సభాపతి

బెంగళూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): విధానపరిషత్‌లో మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్, ఎమ్మెల్సీ సీటీ రవి మధ్య చోటు చేసుకున్న వివాదంపై పంచనామాకు అనుమతులు ఇవ్వలేదని సభాపతి బసవరాజ హొరట్టి తెలిపారు. హుబ్బళ్ళిలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వివాదం చేయిదాటిందన్నారు. వివాదానికి సంబంధించి పంచనామాకు డీజీపీ అనుమతి కోరారన్నారు. పంచనామా ఏ విధంగా జరుపుతారనేది స్పష్టత లేనందున అనుమతులు ఇవ్వలేదన్నారు. వివాదం జరిగినప్పుడు అక్కడ ఉండే వారందరినీ పిలిపించి పంచనామా చేస్తారా..? లేదా ఖాళీగా అమలు చేస్తారా అనేది తెలియదన్నారు. డీజీపీ, పరిషత్ కార్యదర్శికి లేఖ పంపారన్నారు. మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ తనకు లేఖ రాయడం మినహా వీడియో, ఆడియో వంటి ఎటువంటి ఆధారాలు ఇవ్వలేదన్నారు. ఎవరైనా ఆధారాలు ఇస్తే ఎఫ్ఎస్ఎల్‌కు పంపుతామన్నారు. సోమవారం పరిషత్ కార్యదర్శి మహాలక్ష్మికి లేఖ పంపారు.

డీజీపీకి ఫిర్యాదు

బెళగావి పరిషత్‌లో డిసెంబరు 19న చోటు చేసుకున్న సంఘటనలకు సంబంధించి ఎమ్మెల్సీలు సీటీ రవి, రవికుమార్ తదితరులు మంగళవారం డీజీపీని కలిశారు. బెళగావిలోని సువర్ణసౌధ లోపలకు వచ్చిన మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ అనుచరులు దాడి చేశారని డీజీపీ అలోక్‌మోహన్‌కు ఫిర్యాదు చేశారు. బెళగావి నగర పోలీస్ కమిషర్, ఎస్పీలపైనా ఆరోపణలు చేశారు. డీసీఎం డీకే శివకుమార్, ప్రోత్సాహంతోనే దాడి జరిగిందన్నారు. తనను పశువు తరహాలో కిడ్నాప్ చేశారని, రాత్రంతా ఆరేడు పోలీస్ స్టేషన్లు తిప్పారని తెలిపారు. అందరిపైనా కఠినచర్యలు తీసుకోవాలని కోరారు.



ప్రమాదానికి కారణమైన బస్సు

బైక్‌ను ఢీ కొన్న కేఎస్ ఆర్టీసీ బస్సు

- ముగ్గురి దుర్మరణం

..8లో



విజయలక్ష్మికి విషెస్ చెప్పేదాన్ని..

ఇంటర్ చదువుకునే రోజుల్లో నా బెస్ట్ ఫ్రెండ్ విజయలక్ష్మి. ఆమెది కర్నూలు జిల్లా. అక్కడే బయాలజీ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తోంది. అప్పుడు కొత్త ఏడాదికి తప్పకుండా విషెస్ చెప్పేదాన్ని. ఇప్పుడు సెల్‌ఫోన్ వచ్చాక అనాటి పరిచయాలు, జ్ఞాపకాలు చెరిపేస్తోంది. ఇప్పుడంతా కేక్ కటింగ్స్, సెల్‌ఫోన్‌లో చాట్ వంటివే నడుస్తున్నాయి. జనవరి ఫస్ట్ వచ్చిందంటే చిన్నప్పటి 50 పైసల పోస్టుకార్డులు, గ్రీటింగ్ కార్డులే గుర్తుకొస్తున్నాయ్.

మాది పెనుకొండ దగ్గరలో ఉండే గోనిపెంట తండా. అమ్మానాన్నలకు ఐదుగురం సంతానం. మా ఊరికి బస్సులు లేవు. చదువుకోడానికి ఉదయం మూడు గంటలపాటు అడవుల్లోంచి నడుచుకుంటూ పెనుకొండకు వచ్చేటోళ్లం. హైస్కూల్ చదువులు ముగిసిన తర్వాత పై తరగతులు వెల్ఫేర్ హాస్టళ్లలో ఉంటే చదువుకునే దాన్ని. మా ఊరంతా కలిస్తే... 500 మంది జనాభా. ఊర్లో జనవరి ఫస్ట్ అంటే పెద్దగా తెలీదు. కానీ హాస్టళ్లలో ఉండే పిల్లలం మేము చేసుకునేవాళ్లం. ప్రతి నెలా హాస్టల్ పిల్లలకు రూ.10 నుంచి రూ.15 కాస్మొటిక్ చార్జీలు ఇచ్చేవాళ్లు. అందులోంచి కొంత దాచుకుని.. గ్రీటింగ్ కార్డులు, కలర్స్ తెచ్చుకునేవాళ్లం. 50 పైసల పోస్టు కార్డులే పెద్ద గ్రీటింగ్ కార్డులు భావించే వాళ్లం. మా అన్నలు చదువుకున్నవారు కావడంతో ఇంట్లో ఇన్‌ల్యాండ్ లెటర్లు ఉండేవి. అందులో రాసి బంధువులు, మిత్రులకు శుభాకాంక్షలు చెప్పేవాళ్లం.

- సుమిత్ర, ఎస్జీటీ, నెహ్రూ మున్సిపల్ అప్పర్‌ప్రైమరీ స్కూల్, అనంతపురం

(ఆంధ్రజ్యోతి, అనంతపురం విద్య)



అనంతలో అర్ధరాత్రి 12 గంటలకు..



అనంత.. కేరింత..





ఎన్నో ఊహలు, మరెన్నో ఊసులు
ఎన్నో ఆశలు, మరెన్నో ఆశయాలతో
దోగాడిన ఏడాది కాలగమనంలో కలిసిపోయింది.
చేదును మరిచి... తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ..
కొత్త మజిలీ ప్రయాణానికి సర్వం సిద్ధమైంది.
నవ్య పథాన్ని భవ్యమైన లక్ష్యాలతో
సుమనోహరంగా స్వాగతిస్తోంది కొత్త ఏడాది.
ఈ సందర్భంగా..
నేటి పెద్దలు చిన్ననాటి ముచ్చట్లను
జ్ఞాపకాల దొంతరల నుంచి దించి
చిన్నపిల్లల్లా చెబుతూ సంబరపడుతుంటే ...
వినడానికే ఎంతో ఇంపుగా ఉంది. అందుకే
కాలం ఒక్కసారి వెనక్కి వెళితే
వాహ్..! ఎంత బాగుంటుందో..!
అస్తమించిన రవిని తలచుకుని వేదన పడటం కంటే
నవోదయంలో బాల భానుడిని స్వాగతించటం మేలు కదా

ఊసులు.. ఉషస్సులు 2025



కొత్త ఏడాదిలోకి కాలం అడుగులు.. జ్ఞాపకాల మూటలతో జనం కూడా..

సొంత ఆటో కొంటా..



ఈ ఏడాది సొంతంగా ఆటో కొనుక్కోవాలనుకుంటున్నా. ఫైనాన్స్ కంతులు చూసి భయమేసి 2024లో షోరూం ఆటో కొనలేకపోయా. డబ్బులు సమకూర్చుకుని కొత్త ఏడాదిలో తప్పకుండా కొత్త ఆటో కొంటా. నా చిన్నప్పటి నుంచి కూడా న్యూ ఇయర్ వస్తోంది అంటే పండగలాగే ఉండేది. ప్రతి ఏడాది చిన్ననాటి మిత్రులతో కలిసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకునేవాడిని. అయితే మూడేళ్లుగా నా మిత్రుల్లో ఇద్దరికి విషెస్ చెప్పలేకపోతున్నా. సత్యదీప్ ఆస్ట్రేలియాలో ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. నరేష్ గుజరాత్‌లో పనిచేస్తున్నాడు. వీరి ఫోన్ నంబర్లు నాదగ్గర లేవు. వారి నంబర్లు తెలుసుకోవడానికి ఎంతగానో ప్రయత్నించినా ఫలితం లేదు. ఈసారి ఎలాగైనా ఫోన్ నంబర్లు సంపాదించి, విషెస్ చెప్తా. మా చిన్నప్పుడు డిసెంబరు నెల వచ్చిందంటే 31వ తేదీ ఎప్పుడొస్తుందా అని ఎదురుచూసేవాళ్లం. ఆ రోజు రాత్రి మా మిత్రులందరూ కలిసి భోజనాలు వండించుకుని తినేవాళ్లం. బయట సైకిళ్లపై షికారు చేస్తూ రాత్రంతా ఆనందంగా గడిపేవాళ్లం. అర్ధరాత్రి సమయంలో కేక్ కట్ చేసి విషెస్ చెప్పుకునేవాళ్లం. జనవరి 1న సినిమా హీరోల గ్రీటింగ్‌లు తీసుకొని ఒకరికొకరు ఇచ్చుకొని హ్యాపీ న్యూఇయర్ చెప్పుకునేవాళ్లం. అయితే పెళ్లి అయిన తరువాత కుటుంబసభ్యులతో ఆ ఆనందాన్ని పంచుకుంటున్నా. కొత్త సంవత్స రంలో ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు లాంటివి ఏర్పాటు చేస్తే మాకు భరోసాగా ఉంటుంది. ఆటో డ్రైవర్ల పిల్లలకు స్కాలర్‌షిప్పులు ఇస్తే బాగుంటుం దని కోరుకుంటున్నా.

- ఆటో డ్రైవర్ శ్రీనివాసులు, అనంతపురం

- ఆంధ్రజ్యోతి, అనంతపురం ప్రెస్‌క్లబ్



2024 తుది సంధ్య బుక్కరాయసముద్రం చెరువులో..

ఇంకా బాగా చదువుతా..




అనంతపురం విద్య: 'మాది అనంతపురం. నాన్న వన్నూరుస్వామి, అమ్మఅలివేలమ్మ. పోలీస్ హెడ్ క్వార్టర్స్ ఉంటున్నాం. 2023లో జూనియర్ కళాశాలలో ఓ స్కాలర్‌షిప్ పరీక్షకు హాజరయ్యా. పాల్గొన్న 9 మందిలో నన్ను సెలెక్ట్ చేశారు. అప్పుడు కలిగిన ఫీలింగ్ జీవితంలో మర్చిపోలేను. కానీ 2024లో ఎక్కువ సార్లు స్కూల్‌కు ఆబ్సెంట్ అయ్యా. మాతోటి ఫ్రెండ్స్‌ను ఎక్కువ మిస్సయ్యా. కొత్త ఏడాదిలో మాత్రం ప్రశ్నించే అధికారి(సీబీసీఐడీ) కావడానికి తగ్గట్లుగా బాగా చదువుకోవాలని సంకల్పించుకున్నా. సమాజంలో కొందరు డబ్బులను దోచేస్తున్నారు. కొందరు రాజకీయ నాయకులు అవినీతితో డబ్బులు పోగేసుకుంటున్నారు. దీంతో చాలా మంది ప్రజలు నష్టపోతున్నారు. రాజకీయ నాయకులను ప్రశ్నించేందుకు కలెక్టర్ పోస్టు కూడా కరెక్ట్ కాదన్నది నా అభిప్రాయం. అందుకే అందరినీ ప్రశ్నించే అధికారిని కావాలనుకుంటున్నా. కొత్త ఏడాదిలో ఇదే బలమైన నిర్ణయం. గ్రీటింగ్‌కార్డులు బ్రిటీష్ పాలనలో మనకు అలవాటు చేశారని మా స్కూల్ టీచర్లు చెప్పారు. అందుకే వాటిని మేం వాడం. పేపర్ క్రాఫ్ట్ చేసి నా ఫ్రెండ్స్‌కు పంచుతా. నా ఫ్రెండ్ ఇషిత గుడ్ న్యూస్ అయినా...బ్యాడ్ న్యూస్ అయినా మొదట నాకే చెబుతుంది అందుకే తను నా బెస్ట్ ఫ్రెండ్. తనతో కొత్త ఏడాది విషెస్ షేర్ చేసుకుంటా.

- ముక్తేశ్వరి, ఏడో తరగతి, నెహ్రూ స్కూల్, అనంతపురం

ఇద్దరం ఒకే ఊరిలో పని చేయాలి..

కానిస్టేబుల్ రామ్‌ప్రసాద్



నేను బుక్కరాయసముద్రం పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నా. నా భార్య పవిత్ర నార్పలలో ఏఎన్ఎంగా చేస్తోంది. ఇద్దరం స్పౌజ్ కింద ఒకే ఊర్లో ఉద్యోగం వస్తే బాగుంటుందనుకున్నాం. కానీ 2024లో ఆరోగ్యశాఖలో బదిలీలు జరగలేదు. దీంతో ఒకే ఊర్లో పని చేయాలన్న కోరిక తీరలేదు. నూతన సంవత్సరంలోనైనా తీరుతుందేమోనని ఆశగా ఉన్నా. చిన్నప్పుడు కొత్త సంవత్సరం వస్తుందంటే ఆ జోరే వేరు. కొత్త డ్రస్సులు కొనిచ్చుకునేవాళ్లం. బడిలో స్నేహితులందరికీ చాక్లెట్లు పంచిపెట్టేవాళ్లం. కొంత వయసు వచ్చాక అందరం కలిసి కేక్ కొని కట్ చేసి ఆనందం పంచుకునేవాళ్లం. ఇక అప్పట్లో సినిమా హీరోల గ్రీటింగ్స్‌తోనే శుభాకాంక్షలు చెప్పుకునేవాళ్లం. గ్రీటింగ్స్‌పై స్నేహితుల పేర్లు రాసి వారికి ఇచ్చేవాళ్లం. అదే అమ్మాయిలకైతే ఫ్లవర్స్ ఉన్న గ్రీటింగ్స్ ఇచ్చేవాళ్లం. చిన్న నాటి స్నేహితులకు అప్పట్లోలా ఇప్పుడు గ్రీటింగ్ కార్డు, ఇతరత్రా పంపలేం. కొరియర్ ద్వారా కుదరని పరిస్థితి. కేవలం వాట్సాప్ ద్వారానే శుభాకాంక్షలు చెబుతున్నాం.

ఈ ఏడాది ఆ స్నేహితుడిని కలిసి విషెస్ చెప్పాలని...

పాత స్నేహితులను తరచూ కలవాలని ఉంటుంది. కానీ కుదరడం లేదు. మారుతి అని చిన్ననాటి స్నేహితుడున్నాడు. అతను ఇప్పుడు తాడిపత్రిలో రిలయన్స్ ఎగ్జిక్యూటివ్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. అతనితో చిన్న నాటి నుంచి ఎన్నో ఊసులున్నాయి. ఈ సారి కొత్త సంవత్సరం అతనికి శుభాకాంక్షలు చెప్పాలనుకుంటున్నాను.

మేనమామ పిల్లనివ్వనన్నాడు..

నేను ఏడో తరగతి ఫెయిల్ కావడంతో సినిమా థియేటర్ గేట్ కీపర్‌గా పని చేస్తుండేవాడిని. నా కుటుంబానికి అండగా ఉండాల్సిన పరిస్థితి. ఆ సమయంలో నాకు తన కుమార్తెను ఇవ్వడానికి మా మేనమామ ఒప్పుకోలేదు. దాంతో నాలో ఎదగాలనే కసి పెరిగింది. అనుకున్నదే తడవుగా టెన్త్ ఓపెన్‌లో చేశాను. తరువాత ఓపెన్‌లోనే ఇంటర్ పూర్తి చేశా. 2003లో హోంగార్డు ఉద్యోగం సాధించా. ఆ తరువాత 2007లో నోటిఫికేషన్ రావడంతో పరీక్షలో ఉత్తీర్ణత సాధించి 2009లో కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరాను.

ప్రేమ పెళ్లికి యుద్ధమే చేయాల్సి వచ్చింది...

ఇంటర్ చదువుతున్న సమయంలో నేను, పవిత్ర ప్రేమించుకున్నాం. హోంగార్డుగా ఉన్న సమయంలో తనను ఇచ్చి పెళ్లి చేయమని కోరాను. కానీ ఆమె తండ్రి వెటర్నరీ డాక్టర్ కావడంతో హోంగార్డుగా ఉన్న నాకు తన కుమార్తెను ఇచ్చి పెళ్లి చేయడానికి ఇష్టపడలేదు. పెళ్లి కోసం పెద్ద యుద్ధమే చేయాల్సి వచ్చింది. చివరికి అందరినీ ఒప్పించి వివాహం చేసుకున్నాం. అలా 2006లో మా పెళ్లి జరిగింది. ఇద్దరు సంతానం బాబు రామ్‌చరణ్ పాలిటెక్నిక్, కుమార్తె భవ్య శరణ్య పదోతరగతి చదువుతోంది. కుమారుడు రెజ్లింగ్స్ నేషనల్స్‌లో ఆడాడు. అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఎస్సే రైటింగ్, వక్తృత్వపోటీల్లో నా కుమార్తె రెండు బహుమతులు సాధించడం, జిల్లా ఎస్పీ జగదీష్ సర్ చేతుల మీదుగా అందుకోవడం 2024లో నాకు బాగా గుర్తుండిపోయే సంఘటన.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం

అప్పటి కళ లేదు



ఓ 20 ఏళ్ల కిందటి వరకు జనవరి ఫస్ట్ వస్తోందంటే డిసెంబరు నెల నుంచే టైలర్ల షాపులు కళకళలాడేవి. చిన్న, పెద్ద అందరూ కొత్త దుస్తులు కుట్టించుకోవడానికి ఉత్సాహం చూపేవారు. పిల్లల కోసం కుట్టమని ఇచ్చిన బట్టలు చెప్పిన టైంకు కుట్టకపోతే షాపువద్దకు వచ్చి అక్కడే ఉండి కుట్టించుకుపోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. మేము కూడా డిసెంబరు 31న అర్ధరాత్రి వరకు షాపు తెరచుకొని డ్రెస్సులు కుట్టేవాళ్లం. ఇంటికి కూడా కొన్ని దుస్తులు తీసుకు వెళ్లి తెల్లవారుజాము వరకు కుట్టి ఇచ్చేవాళ్లం. జనవరి ఫస్ట్‌కు ఇవ్వలేని సందర్భంలో కొందరు గొడవ పడేవారు. ఇదంతా గతం. ఇప్పుడు టైలర్లతో డ్రెస్సులు కుట్టించుకొనే వాళ్లు బాగా తగ్గిపోయారు. ఈ జనరేషన్ పిల్లలు అంతా రెడీమేడ్ దుస్తులే తొడుగుతున్నారు. పొద్దున జనవరి ఫస్ట్ అనగా రాత్రి అట్లా షాపునకు వెళ్లి ఇట్లా బట్టలు తెచ్చేసుకుంటున్నారు.

- వాసు, టైలర్, యాడికి

మెకడమియా సాగు చేస్తా



నూతన సంవత్సరంలో ఉద్యాన పంటల దిగుబడిలో పురోగతి సాధించాలనేదే నా లక్ష్యం. బ్రహ్మజెముడు మొక్కల నర్సరీతోపాటు మెకడమియా నట్స్ పంట పెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నా. నేను పదో తరగతి చదివే సమయంలో జనవరి ఫస్ట్ వస్తోందంటే చెప్పలేని సంబరంగా ఉండేది. వారం ముందు నుంచే గ్రీటింగ్ కార్డులు కొనేవాళ్లం. వాటిని స్నేహితులకు చూపి ఎవరికి ఏది కావాలో అడిగి దానిపై వారి పేరు రాసేవాళ్లం. వాటిని జనవరి 1న కొత్త బట్టలు వేసుకొని ఆనందంగా స్కూల్‌కి వెళ్లి నా మిత్రులకు ఇచ్చేవాడిని. బంధువులకు పోస్టు ద్వారా గ్రీటింగ్స్ పంపేవాడిని. ఆదోనిలో ఇంటర్, డిగ్రీ చదివే రోజుల్లో గ్రీటింగ్ ఇచ్చుకోవడంతోపాటు కీప్యాడ్ ఫోన్ ద్వారా సెల్ ఫోన్లు ఉన్న ఫ్రెండ్స్‌కు మెసేజ్ ద్వారా శుభాకాంక్షలు చెప్పేవాడిని. ఇంటర్ నుంచి న్యూ ఇయర్‌ను స్వాగతిస్తూ ప్రతి సంవత్సరం డిసెంబరు 31 రాత్రి 12గంటలకు కేక్ కట్ చేసుకొని ఆనందంగా గడిపేవాళ్లం. డిగ్రీ పూర్తయిన తర్వాత ఫ్రెండ్స్ అంతా విడిపోయాం. ప్యాపిలి జడ్పీ స్కూల్‌లో పదోతరగతి క్లాస్‌మెట్స్‌లో బెస్ట్ ఫ్రెండ్స్ ఆర్.మురళీ కృష్ణ. ప్రస్తుతం ఆయన రాజకీయాల్లో ఉన్నాడు. మరో ఫ్రెండ్ లతీఫ్ ప్రభుత్వ టీచర్‌గా పనిచేస్తున్నాడు. డిగ్రీ పూర్తయిన తర్వాత నేను వ్యవసాయం మొదలు పెట్టా. అయినా ప్రతి ఏడాది వ్యాట్సాప్‌లో ఫ్రెండ్స్‌కు న్యూ ఇయర్ శుభాకాంక్షలు చెబుతున్నా. ఐదేళ్ల కిందట మూడెకరాల్లో బ్రహ్మజెముడు పంట సాగు చేశా. దాన్ని మీడియా ద్వారా తెలుసుకున్న పలువురు రైతులు సాగు విధానం గురించి నన్ను సంప్రదిస్తున్నారు. మన రాష్ట్రంతోపాటు తెలంగాణ, కర్ణాటక ప్రాంతాల నుంచి వస్తున్నారు. దానిపై సలహాలు ఇస్తున్నా. ఆయా ప్రాంతాల్లోని రైతులకు బ్రహ్మజెముడు మొక్కలను 2024 నుంచి సరఫరా చేయడం మొదలుపెట్టాను. ఈ ఏడాది బాగా గుర్తుండిపోయే సంఘటన ఇదే. ఈ ఏడాది మా పాత ఫ్రెండ్స్ అంతా కలిసి న్యూఇయర్ వేడుకలు జరుపుకునేందుకు ప్లాన్ చేస్తున్నాం.

- వెంకటేశ్వరరెడ్డి, ఊటకల్లు,

- గుత్తి రూరల్

కొత్త ఇల్లు కట్టుకోవాలి...



మాది రేకుల కుంట గ్రామం. నేను ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్నా. తర్వాత రేకులకుంటలోనే వ్యవసాయం చేసేవాడిని. 2024 సంవత్సరం ముగిసేనాటికి సొంతిల్లు కట్టుకోవాలనే సంకల్పంతో మూడేళ్ల కిందట అనంతపురం వచ్చి ఆకుకూరల వ్యాపారం మొదలు పెట్టా. వ్యాపారాన్ని వృద్ధి చేసుకోగలిగాను కానీ కొత్త ఇల్లు మాత్రం కట్టలేకపోయా. కొత్త సంవత్సరంలోనైనా సొంతిల్లుల్లు కట్టుకోవాలని ఆశిస్తున్నా. నేను చదువుకునే సమయంలో హాస్టల్‌లో నూతన సంవత్సర వేడుకలంటే సంబరంగా చేసుకునేవాళ్లం. హాస్టల్‌లో ప్రత్యేకంగా చికెన్ కర్రీ వండేవాళ్లు. స్నేహితులతో కలిసి మిఠాయిలు, చాక్లెట్లు పంచుకుని శుభాకాంక్షలు తెలుపుకునేవాళ్లం. జనవరి 1న ఊరికి వెళ్లి, మిత్రులందరితో కలిసి ఊరంతా సందడి చేసేవాళ్లం. ప్రతి జనవరి 1న నా మిత్రులను కలుస్తుంటా.

- తిరుమలేష్, ఆకుకూరల వ్యాపారి

- ఆంధ్రజ్యోతి, అనంతపురం కల్చరల్



వర్జీనియాలో శ్రీహరి కుటుంబం

సొంతూరులో వేడుక చేసుకోవాలి..



అనంతపురం క్లాక్‌టవర్: సొంతూరైన అనంతపురంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలన్నది నా చిరకాల కోరిక. బంధుమిత్రులతో కలిసి అక్కడ వేడుకలు చేసుకోవాలని ప్రయత్నిస్తున్నా కుదరడం లేదు. ప్రస్తుతం నేను అమెరికాలో స్థిరపడ్డా. అక్కడ ఉన్నా భారతీయ సంస్కృతీసంప్రదాయాలంటేనే ఇష్టం. ఇండియా సంస్కృతి, సంప్రదాయాలంటేనే మక్కువ ఎక్కువ. కొత్త ఏడాదిలో ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలని దేవున్ని ప్రార్థిస్తున్నా. నూతన సంవత్సరం మనసుల్లో ఉండే రుగ్మతలు, దురాలోచనలు తొలగించి, కొంగొత్త ఆలోచనలతో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నా. నూతన సంవత్సరం సందర్భంగా ప్రతి ఒక్కరికి సత్ఫలితాలు, సరికొత్త ఆవిష్కరణలకు సహకరించాలని జనవరి 1న అమెరికాలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నాం. నా మిత్రులు, బంధువులకు సోషల్ మీడియా, ఫోన్‌తో పాటు ఈ ఏడాది ప్రత్యేకంగా ఆంధ్రజ్యోతి ద్వారా నూతన సంవత్సర శుభాకాంక్షలు కుటుంబంతో కలిసి చెప్పే అవకాశం లభించడం సంతోషంగా ఉంది.

- ప్రవాసాంధ్రుడు శ్రీహరి

రైల్వేలో ఉద్యోగం సాధిస్తా..




నూతన సంవత్సర వేడుకలను పల్లెటూర్లలో మిత్రులతో కలిసి చేసుకుంటే సంబరమే వేరు. కూడేరు మండలం చోళసముద్రం మా సొంతూరు. కణేకల్లులో ఇంటర్ వరకు చదివా. ఆ తర్వాత 2019లో ఉపాధికోసం అనంతపురం వచ్చేశా. 2021లో ప్రభుత్వ వైద్య కళాశాలలో సెక్యూరిటీగార్డుగా చేరా. 2024లో మా వేతనాలు పెరుగుతాయని ఆశించాము, పెరగలేదు. అయితే ఈ ఏడాది మా అక్కకు కుమారుడు జన్మించడం నాకు మరిచిపోలేని తీపి గుర్తు. 2025లో రైల్వేలో ఉద్యోగం సాధించాలని ఆశిస్తున్నాను. ప్రస్తుత నా విధుల కారణంగా నూతన సంవత్సర వేడుకలు కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకోవడం కొంత ఇబ్బందే. గతంలో నేను చదువుకునే సమయంలో మా స్కూల్‌లో ఫ్రెండ్స్‌తో కలిసి చాక్లెట్లు పంచుకుని శుభాకాంక్షలు తెలుపుకోవడంతోపాటు ఇంటికి వచ్చాక మిత్రులతో కలిసి కేక్ కట్ చేయడం, జనవరి 1న రెస్టారెంట్‌కు వెళ్లి అందరం కలిసి బిరియానీ పార్టీ చేసుకోవడం లేదా ఏదైనా సినిమాకు వెళ్లే వాళ్లం. నా మిత్రుల్లో ఇప్పటికీ అత్యంత సన్నిహితంగా ఉన్నది సూర్యకిరణ్. ప్రతి నూతన సంవత్సరం రోజున సూర్యకిరణ్‌కే తొలుత శుభాకాంక్షలు చెబుతా.

- ఎర్రిస్వామి, సెక్యూరిటీగార్డు, ప్రభుత్వ వైద్య కళాశాల

- ఆంధ్రజ్యోతి, అనంతపురం కల్చరల్

2025



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.55	1,589.09
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	219	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	9,000	0
నీటి నిల్వ (టీఎంసీలు)	81.68	10.29

యూనివర్సిటీ స్థాయి పోటీలకు ఎంపిక



పరుగు పోటీలో లోకేష్ రాథోడ్

బళ్లారి సిటీ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన రన్నింగ్ క్రీడాకారుడు లోకేష్ రాథోడ్ యూనివర్శిటీ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. కళింగ యూనివర్శిటీ, ఒడిశా, భువనేశ్వర్ ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్శిటీ అథ్లెటిక్ టోర్నమెంట్‌లో శ్రీ కృష్ణ దేవరాయ యూనివర్శిటీ నుంచి ఎంపికయ్యాడు. విజయనగరం బళ్లారి హూవినహడగలికి చెందిన లోకేష్ రాథోడ్ 6,258 మార్కులు సాధించి, ఆలిండియా ఇంటర్ యూనివర్శిటీ గేమ్స్‌లో ఆరోస్థానంలో నిలిచాడు. డెకాథ్లాన్‌లో అర్హత సాధించాడు. అథ్లెటిక్స్‌లో బళ్లారి యూనివర్శిటీ సాధించిన గొప్పవిజయం ఇదే. యూనివర్శిటీ చాన్సలర్, అడ్మినిస్ట్రేషన్, ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ డిపార్ట్‌మెంట్, అథ్లెటిక్స్ టీమ్ మేనేజర్లు,కోచ్‌లు, డాక్టర్ శశిధర కెల్లూరా, బోధన, బోధనేతర సిబ్బంది అతన్ని అభినందించారు.

నాసిరకంగా డ్రైనేజీ పనులు



బెడ్డింగ్ లేకుండా నిర్మించిన కాలువ

సిరుగుప్ప, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 22వ వార్డు డీఎల్‌డీ బ్యాంకు వద్ద జరుగుతున్న డ్రైనేజీ పనులు నాసిరకంగా ఉన్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. నేలమట్టంలో బెడ్డింగ్ వేయకుండా ఇష్టానుసారంగా పనులు చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇలా చేయడం వల్ల నీరు ఎక్కడికక్కడే ఆగి మళ్లీ మొదటి పరిస్థితికే వస్తాయ ంటున్నారు. నగర సభ ఇంజనీర్లు ఈ పనులను పరిశీలించి చర్యలు తీసుకో వాలని కోరుతున్నారు.

మనోహర్‌బాబుకు పీహెచ్‌డీ ప్రదానం



బళ్లారి సిటీ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మేధా కాలేజీలో వాణిజ్య విభాగం అధ్యాపకుడు మనోహర్‌బాబు పీహెచ్‌డీ అందుకున్నారు. కళ్యాణ కర్ణాటక ప్రాంతం గార్మెంట్స్ తయారీ యూనిట్లలో ఉద్యోగుల సమస్యలు అవకాశాలపైఅధ్యయనంపై ఆయన పరిశోధన చేశారు. విజయనగరం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఆయనకు పీహెచ్‌డీ ప్రదానం చేసింది. మేధా కాలేజీ ప్రిన్సిపాల్ రామ్‌కిరణ్. కాలేజీ పాలక మండలి, బోధన బోధనేతర సిబ్బంది అయన్ని అభినందించారు.

నేడు 'నాదోపాసన' సంగీతం

బళ్లారి సిటీ,డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాఘవ కళామందిరంలో బుధవారం సాయంత్రం 'నాదోపాసన' కార్యక్రమం ఉంటుందని రాఘవ మెమోరియల్ అసోసియేషన్ ప్రకటించింది. అసోసియేషన్, వ్యాగ్ ఇండియా ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరగనుంది.

కాపరులు..!

- ప్రమాదంలో మూగజీవాలు బలవుతున్నా చర్యలు శూన్యం
- పరిహారం అడిగితే తమ ప్రాంతం కాదంటున్న పోలీసులు
- వాహనదారులపై నామమాత్రంగా ఎఫ్ఐఆర్
- అమాయకులను బెదిరిస్తున్న యజమానులు



మృతి చెందిన గొర్రెలను చూపుతున్న కాపరులు (ఫైల్)

బళ్లారి గాంధీనగర్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మూగజీవాలను బలిగొన్న యజమానులపై చర్యలు తీసుకోవడంలో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పరిహారం అందించకపోగా మీరు మా ప్రాంతానికి చెందిన వారు కాదు..మీ గోడు పట్టించుకునేది లేదు అన్నట్లు ప్రవర్తిస్తున్నారు.గొర్రెల పెంపకమే జీవనంగా మార్చుకుని బతుకు సాగదీస్తున్న గొర్రెల కాపరుల జీవితాలు దర్భరంగా మారాయి. తమ జీవనాధారమైన గొర్రెలు చనిపోతే పరిహారం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిహారం అందించకపోగా వాహనయజమానులు బెదిరింపులకు దిగుతున్నట్లు తెలుస్తోంది. తుంగభద్ర పరీవాహక ప్రాంతాల్లో పచ్చిక బైళ్లను నమ్ముకుని గుల్బర్గా, బీదర్, బెళగామ్‌కు చెందిన ఎందరో గొర్రెల కాపరులు బతుకుతున్నారు. ఏటా కోతలు ముగిసిన తరువాత మేతకోసం బళ్లారి, కొప్పళ, రాయచూరు ప్రాంతాలకు వందలాది గొర్రెలను మేతకోసం తీసుకురావడం పరిపాటి. అయితే గొర్రెలను మేతకోసం తీసుకెళుతున్న సమయంలో జరిగే రోడ్డు ప్రమాదంలో గొర్రెలు మృతిచెందడంతో పాటు చాలావరకు గొర్రెలు గాయపడడంతో గొర్రెల కాపరులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. ఇతర ప్రాంతాల నుండి వచ్చిన గొర్రెల కాపరులపై స్థానికుల నుంచి బెదిరింపులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి ఘటనలుపై పోలీసు అధికారులు కూడా స్థానికులకే వత్తాసు పలుకుతుండడంతో ప్రమాదాలపై పోలీసు స్టేషన్‌లలో నామ మాత్రంగానే కేసులు నమోదు అవుతన్నాయి. గొర్రెల కాపరులకు జరిగిన నష్ట పరిహారం ఇప్పించడంలో పోలీసు అధికారులు పూర్తిగా నిర్వీర్యం అవుతున్నట్లు తెలుస్తోంది. పైగా వాహనాల యజమానులు పై స్థాయి నుంచి ఒత్తిళ్లు తెస్తున్నట్లు సమాచారం.

గతనెల 23న మోకా పోలీసు స్టేషన్ పరిధిలోని ఎర్రగుడి సమీపంలో గొర్రెల మందపై ఓ ప్రైవేట్ బస్సు దూసుకెళ్ళడంతో తొమ్మిది గొర్రెలు మృతి చెందగా, 17కు పైగా తీవ్రంగా గాయపడ్డాయి. విషయం తెలుకున్న మోకా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. బాధితుడైన గొర్రెల కాపరి మోకా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎఫ్ఐఆర్ ప్రకారం.. బెళగామ్ జిల్లాకు చెందిన కాదకలాట గ్రామానికి చెందిన అప్పన్న మారుతి అనే గొర్రెల కాపరి తుంగభద్ర ఎల్లెల్సీ ఆయకట్టు 250 గొర్రెలను మేతకోసం తీసుకెళుతుండగా ప్రమాదం జరిగింది. 132వ రాష్ట్ర రహదారిపై మీనాక్షి ట్రావెల్స్‌కు చెందిన ఏపీ-02, టీఈ 3800 నెంబరు గల బస్సు గొర్రెల మందపై దూసుకెళ్ళడంతో బస్సు చక్రాల కింద పడి గొర్రెలు మృత్యువాత పడ్డాయి. రిజిస్ట్రేషన్ వివరాల ప్రకారం బళ్లారికి చెందిన మీనాక్షి ట్రావెల్స్‌కు చెందినదిగా పోలీసులు గుర్తించారు. ఏపీ రిజిస్ట్రేషన్ కలిగిన బస్సుకు ఇన్సూరెన్స్ గత ఏడాది మే నెలలోనే ల్యాప్స్ అయిందని, కాంట్రాక్ట్ క్యారియర్ క్రింద నడపాల్సిన బస్సు స్టేజ్ క్యారియర్ క్రింద ప్రతి రోజు బళ్లారి-ఆదోని మార్గంలో నడుపుతున్నట్లు ఆర్టీవో అధికారులు వివరాలు సేకరించినట్లు సమాచారం. ప్రమాదంలో మృతి చెందిన గొర్రెల యజమాని నష్టపరిహారం ఇవ్వాలని బస్సు యజమానులను అడిగితే... తాము నష్టపరిహారం ఇచ్చేది లేదని... కేసు పెట్టుకోమని నిర్లక్ష్య సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. ప్రమాదం జరిగి ఇన్నాళ్లయినా ఇంతవరకు గొర్రెల కాపరులకు నష్టపరిహారం ఇప్పించడంలో ఇటు పోలీసులు... అటు బస్సు యజమాని స్పందించకపోవడంతో కాపరుల పరిస్థితి దిక్కుతోచని విధంగా తయారైంది. తమకు తిండి పెట్టే మూగజీవాలను బలిగొన్నా యజమానులపై చర్యలు తీసుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మోకా పోలీసు స్టేషన్ ముందు ఆగిన ప్రమాదానికి కారణమైన బస్సు

కాంగ్రెస్ కార్యాలయాలుగా పోలీస్ స్టేషన్లు

- అధికారుల ఆత్మహత్యలపై పోలీసుల చర్యలు శూన్యం: ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి ఆగ్రహం

బళ్లారి సిటీ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పోలీస్‌స్టేషన్లు దోపిడీ, దౌర్జన్యాలతో కాంగ్రెస్ కార్యాలయాలుగా మారాయని మాజీ మంత్రి, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీదర్‌లోని బాల్కీ కాంట్రాక్టర్ సచిన్ పంచాల్ ఆత్మహత్య కేసులో మంత్రి ప్రియాంక ఖర్గే వెంటనే రాజీనామా చేయాలన్నారు. ఆయన నాన్న ఏఐసీసీ అధ్యక్షుడిగా ఉన్నందునే ప్రియాంక్‌పై చర్యలు తీసుకోవడానికి రాష్ట్ర సీఎండీసీఎం వెనుకాడుతుందని ఆరోపించారు. మీరు బట్టలు చింపుకున్నా నేను రాజీనామా చేయను అని అనడం ఆయన గర్వానికి నిదర్శన మన్నారు. ఆయన లాంటి వాళ్ళను ఎలా గద్దెదించాలో బీజేపీకీ తెలుసన్నారు. సచిన్ నిరుపేద కుటుంబం ఏడు పేజీల డెత్ నోట్ రాసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిదంటే ఎంత ఆవేదనకు గురయ్యిందో తెలుసుకోవచ్చని, సచిన్ కుటుంబానికి భద్రత కల్పించాలని, అక్కాచెళ్లలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఉద్యోగుల ఆత్మహత్యలను ప్రభుత్వం తేలిగ్గా తీసుకుంటుందని, ఇప్పటికైనా ధోరణి మార్చుకోవాలన్నారు. వాల్మీకి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ స్కామ్‌తో చంద్రశేఖర్ ఆత్మహత్య చేసుకోవడంతో నాగేంద్ర రాజీనామా చేశారు. ఇప్పుడు ప్రియాంక ఖర్గే బాధ్యతగా రాజీనామా చేయాలన్నారు. బెలగావికి చెందిన రుద్రన్న యాదవంతన్నవర్, దావణగెరెలో కాంట్రాక్టర్, మాగడిలో లారీ యజమాని, యాదగిరిలో పీఎస్ఐ ఇలా అనేక చోట్ల ఆత్మహత్యలు, మరణాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ప్రియాంక ఖర్గే సన్నిహితుడు రాజు కాపనూరు నోరు విప్పితే ప్రియాంక రాజకీయం మొత్తం బయటపడుతుందన్నారు. ఓ వైపు సిటీ రవిపై పోలీసుల దౌర్జన్యం, మునిరత్నపై కోడిగుడ్డు దాడులు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం కరువయ్యిం దన్నారు. విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు హెచ్.హనుమంతప్ప, గోనాల్ రాజశేఖర్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గాలి జనార్దన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లాపంచాయతీ సీఈఓ రాహుల్ శరణప్ప

ఆరోగ్య కేంద్రాలకు అనుమతులు తప్పనిసరి

- జిల్లా పంచాయతీ సీఈఓ రాహుల్ శరణప్ప

బళ్లారి సిటీ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్ని ఆరోగ్య కేంద్రాలు జాతీయ నాణ్యత ప్రమాణాల ప్రకారం తప్పనిసరిగా అనుమతులు, అవసరమైన పత్రాలు కలిగి ఉండాలని జిల్లాపంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప వైద్యాధికారులకు సూచించారు. మంగళవారం నగరంలోని జిల్లాపంచాయతీలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన జిల్లా ఆరోగ్య సంఘం సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రభుత్వ స్థాయిలో సమాజానికి అందజేస్తున్న ఆరోగ్య సేవలను అన్ని స్థాయిల్లో ప్రమాణికంగా తీసుకుని నాణ్యత పాటించాలన్నారు. జిల్లాలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, తాలూకా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యాధికారుల నేతృత్వంలో జాతీయ నాణ్యతా ప్రమాణాల ప్రకారం ధ్రువీకరణకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు విశ్వసనీయత ఉండాలన్నారు. సండూర్, కంప్లి, సిరుగుప్ప, బళ్లారి, కురుగోడు తాలూకాలతో సహా జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు,మందుల లభ్యత, రికార్డుల నిర్వహణ, వైద్య వ్యర్థాల నిర్మూలన,మాతా శిశు సంరక్షణ, కుటుంబ సంక్షేమసేవలు, అంటువ్యాధులు, అసంక్రమిత వ్యాధుల నిర్వహణ, ప్రయోగశాల సేవలు తదితరాలు జిల్లాలో జరగాలన్నారు.

జిల్లాలో కుష్ఠువ్యాధుల నిర్మూలనకు సండూర్ తాలూకాలోని చోరనూర్, బండ్రిలో కేసులు నమోదైనగ్రామాల్లో మరింత అవగాహన కల్పించి కేసులను గుర్తించి చికిత్స కేసులను సున్నాకి చేర్చేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గృహ ఆరోగ్య యోజనను విజయవంతం చేసేందుకు మహిళలతో సహా 30 ఏళ్ల పైబడిన ప్రజలందరికీ ఇంటిస్థాయిలోనే రక్తపోటు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

ఈసందర్భంగా జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి రమేశ్‌బాబు ,జిల్లాసర్జన్ బసారెడ్డి, జిల్లావ్యాధుల నియంత్రణ అధికారి డా.అబ్దుల్లా, డాక్టర్ మరియంబి, జిల్లా ఆర్‌సీహెచ్ అధికారి హనుమంతప్ప, డెంటల్ ప్రోగ్రాం డాక్టర్ విశాలక్షి,తాలూకా అధికారులు డాక్టర్ బసవరాజ్, డాక్టర్ భరత్, మంజునాథ్, జిల్లా విద్యాశాఖాధికారి ఈశ్వర్ దాసప్పనవర్, సరేశ్, గిరీష్, మనోహర్, బసవరాజ్, ఇతర శాఖ సిబ్బంది సహా డీపీఎం వెంకోబా హాజరయ్యారు

మహిళలు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

- కెనరా బ్యాంక్ లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ గిరీష్ కులకర్ణి



మహిళలకు టూల్‌కిట్‌ను అందజేస్తున్న మేనేజర్ గరిశ్ కులకర్ణి, మాలతి

బళ్లారి సిటీ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళా సాదికారత ఎంతో అవసరమని, మహిళలు వివిధ రకాల స్వయం ఉపాధి కోసం సృజనాత్మక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కెనరా బ్యాంక్ లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ గిరీష్ కులకర్ణి సూచించారు. మంగళవారం సంస్థ ఆవరణలో కెనరా బ్యాంక్ ద్వారా ఉచిత కుట్టు మిషన్ శిక్షణ పొందిన మహిళలకు టూల్‌కిట్‌ను పంపిణీ చేసి మాట్లాడారు. కుట్టులో శిక్షణ పొందిన మహిళలు స్వయం ఉపాధి పొందడం సులభ మన్నారు.. కెనరా బ్యాంక్ డివిజనల్ పరిశోధకురాలు మాలతి మాట్లాడుతూ మహిళలు ఇంటి వద్దనే టైలరింగ్ చేయడం వల్ల కుటుంబానికి ఆర్థికంగా తోడ్పాటు ఉంటుందన్నారు. డైరెక్టర్ రాజేసాబ్ మట్లాడుతూ.. సంస్థ శిక్షణలో నైపుణ్యంతో పాటు ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన సమాచారం ఇస్తున్నారని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లాపంచాయతీ యూనిట్ రాజేంద్ర, విజయకుమార్‌తో పాటు జడెప్ప, దినేష్, సిద్దలింగమ్మ, మంజుల, సంతోష్‌కుమార్, కిరణ్‌కుమార్, శిబిర్తి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మండల పూజ

కంప్లి, డిసెంబరు 31(ఆంధ్ర జ్యోతి): విజయనగర జిల్లా హోస్పేట పట్టణంలోని నెహ్రూ కాలనీలో మంగళవారం అయ్యప్ప మండల పూజ భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అయ్యప్పస్వామికి, స్వామి 18 మెట్టుకు ప్రత్యేకాలంకరణ, అనంతరం అమృతాభిషేకం, ఫలాభిషేకం తదితర పూజలు చేపట్టారు. అనంతరం వేణుగోపాలస్వామి దేవాలయం నుంచి అయ్యప్ప స్వామి వారి రథోత్సవాన్ని మేళతాళాలు, భాజభజంత్రీల మధ్య ఊరేగింపు నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించామని పండితుడు శంకర తెలిపారు.



నెహ్రూ కాలనీలో అయ్యప్ప స్వామి ఊరేగింపులో మాలధారులు

హంపిలో పర్యాటకుల సందడి



ఏకశిలారథం వద్ద..



గజశాల వద్ద..

కంప్లి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి పర్యాటక క్షేత్రం హంపిలో ఏడాది చివరి రోజు పర్యాటకులు పోటెత్తారు. నూతన సంవత్సర వేడుకలకు స్వాగతం పలకడానికి ఒక రోజు ముందుగానే చాలా మంది ఇక్కడికి చేరుకున్నారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలతో పాటు విదేశీయులు కూడా సందడి చేశారు. మంగళవారం విరుపాక్షేశ్వర, పార్వతిమాత, భువనేశ్వరి దేవిని దర్శించుకుని కోదండరామ, యంత్రోత్పాదక ఆంజనేయ, ఏకశిలా రథంను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పాటు పడిన కష్టాలు మరచిపోయి నూతన సంవత్సరంలో అడుగుపెట్టేందుకు హంపికి వస్తుంటామని వెల్లడించారు.

మారికాంబదేవికి ప్రత్యేక పూజలు

కంప్లి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని ఎమ్మిగనూరు గ్రామంలో మారెమ్మ, సుంకులమ్మ దేవి కుంభోత్సవాల సందర్భంగా ఈ ఎమ్మిగనూరు గ్రామంలో అమ్మవారి ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారికి కుంభాలతో భక్తులు అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. గ్రామాల్లో ప్రజలు కూడా ఈ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. అమ్మవారి దయతో తమకు పుష్కలంగా పంటలు, సుఖజీవనం కొనసాగిస్తామని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



అలంకరణలో అమ్మవారు

రెండో పంటకూ నీరు.. రైతుల్లో హర్షం

సిరుగుప్ప, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ఆయకట్టు సాగుకు రెండవ పంటకు సరిపడా సాగునీరు వుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సిరుగుప్ప తాలుకాలో కాలువల్లో తుంగభద్ర నది నిండుగా ప్రవహిస్తోంది. 2025 సంవత్సరంలో రెండవ పంట కూడా పండించుకోవచ్చునని తాలుకా వ్యాప్తంగా రైతులు అన్నదాత ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతేడాని వర్షాభావం కారణంగా కాల్వల్లో నీరు లేకుండా ఉండేది. ఈ యేడాది భారీ వర్షాల కారణంగా డ్యామ్ క్రస్ట్‌గేట్లు కొట్టుకుపోయినా తక్షణమే మరమ్మతులు చేపట్టడంతో పాటు, అధిక వర్షాల కారణంగా డ్యామ్ నిండుగా ప్రవహిస్తోంది. రెండవ పంట సాగుకు ఇబ్బంది లేదని అధికారులు పేర్కొంటున్నారు.



సిరుగుప్ప వద్ద నిండుగా ప్రవహిస్తున్న తుంగభద్ర నది

హోసూరు జోన్

చెత్తలో పడేసిన నగలు చేతికొచ్చాయి..!

హోసూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): బ్యాడరపల్లిలోని ఒక ఫ్యాన్సీ దుకాణంలో కర్చీఫ్‌లో ఉంచిన సుమారు 20 గ్రాముల కమ్మలను చెత్తలో పొరపాటున పడేయగా ఆలస్యంగా గురించి ఎట్టకేలకు దక్కించుకోగలిగారు. ఒక కాగితంలో కమ్మలను ఉంచి దాన్ని కర్చీఫ్‌లో కట్టారు. సదరు కర్చీఫ్ చెత్తపక్కన ఉండడంతో దాన్నికూడా చెత్తలో పడేశారు. మంగళవారం యథాప్రకారం కార్పొరేషన్ చెత్త సేకరణ బండి రాగా చెత్తను పడేశారు. దుకాణ యజమాని కొద్దిసేపటి తర్వాత నగల కర్చీఫ్‌ను చెత్తలో పడేసినట్లు గుర్తించి వెంటనే కార్పొరేషన్ అధికారులకు సమాచారం అందించారు. కొద్దిసేపటికే చెత్తసేకరణ బండిని సూపర్‌వైజర్ గుర్తించారు. పడేసిన చెత్తలో కర్చీఫ్ అలాగే ఉంది. ఎట్టకేలకు నగలు లభించడంతో దుకాణదారులు హర్షం వ్యక్తం చేశారు. కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది సదరు దుకాణ యజమానికి అందచేశారు. చెత్త సేకరణ సిబ్బందిని ప్రశంసించారు.



నగలను అప్పగిస్తున్న కార్పొరేసన్ సిబ్బంది

కంకర రోడ్డుతో కష్టాలెన్నో..!

హోసూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఉద్దనపల్లి సమీపంలోని దొడ్డమిట్ట, బండపల్లి ప్రాంతాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా మారాయి. ఎర్నపల్లి పంచాయతీ దొడ్డమిట్టరాయి, బండపల్లి మీదుగా సూలగిరి, రాయకోట, ఉద్దనపల్లి వరకు 50కిపైగా చిన్న తండాలు, పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఫ్యాక్టరీలకు వెళ్లే కార్మికులు సుమారు వెయ్యిమందికిపైగా రాకపోకలు సాగిస్తున్నారు. దాదాపు 5కిలోమీటర్ల మేర రోడ్డు దుస్థితికి చేరుకుంది. ఈ మార్గంలో వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నట్టు వాహనచోదకులు వాపోతున్నారు. వెంటనే రోడ్లను బాగుచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కంకరతేలిన రోడ్డు ఇలా..

పెరిగిన పూల ధరలు - రైతుల్లో హర్షం

హోసూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం నేపథ్యంలో నగరంలోని మార్కెట్‌లో పూలధరలకు రెక్కలు రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హోసూరు, బాగలూరు, బేరికై, కెలమంగలం, ఉద్దనపల్లి, డెంకణీకోట, రాయకోట ప్రాంతాల్లో వివిధ రకాల పుష్పాలు సాగు చేస్తున్నారు. నూతన సంవత్సరం నేపథ్యంలో పూల రైతులు ప్రత్యేక దృష్టి సారిస్తారు. మంగళవారం సుమారు 500 టన్నుల పూలు మార్కెట్‌కు వచ్చాయి. ధనుర్మాసం పూజలు, వివిధ ప్రాంతాల్లో అలంకరణకు పూలకు డిమాండ్ నెలకొంది. 5వేల ఎకరాలలో బంతి పూలు సాగు చేస్తున్నారు. నిరంతరం కురుస్తున్న వర్షాలతో దోమకాటు కారణంగా పూల దిగుబడి తగ్గినా, మిగిలిన పంటకు ధరలు ఆశాజనకంగా ఉండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కిలో మల్లి రూ.2,400, బంతిపూలు రూ.160, బటన్ రోజ్ రూ.160, కనకాంబరం రూ.2వేలు, సంపంగి రూ.100, గన్నేరు పూలు రూ.400 ధర పలికాయి. మార్కెట్‌లో రద్దీ నెలకొంది.



పూల దుకాణాల వద్ద సందడి

ఏనుగుల సంచారంతో బెంబేలు

హోసూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా శానమావు అటవీప్రాంతాలలో సుమారు 17 ఏనుగులు బస చేశాయి. వీటిలో గిరి అనే ఏనుగు గుంపు నుంచి వేరుగా వచ్చి కెలమంగలం పరిధిలోని బొమ్మ తాతనూరు గ్రామానికి వచ్చింది. ఒంటరి ఏనుగు సంచారంతో గ్రామంలో అలజడి నెలకొంది. ప్రత్యేకించి ఒక 12ఏళ్ల బాలుడు పారిపోయే ప్రయత్నంలో ఏనుగు సమీపానికి చేరుకున్నా అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డాడు. చివరకు సమాచారం అందుకున్న హోసూరు అటవీశాఖ అధికారులు ఒంటరి ఏనుగును అడవుల్లోకి పంపేశారు.



వీధిలో చొరబడి బెంబేలెత్తిస్తున్న ఏనుగు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

కేఎల్ఎన్ ప్రసాద్ (జయంతి)



ప్రముఖ పారిశ్రామికవేత్త కానూరి లక్ష్మీనారాయణ ప్రసాద్ 1928 జనవరి 1న కృష్ణాజిల్లా కౌతవరం గ్రామంలో జన్మించారు. కేఎల్ఎన్ ప్రసాద్‌గా చిరపరిచితులు. సంపాదకుడు, హేతువాది అయిన నార్ల వెంకటేశ్వరావు, ఇతర మిత్రులతో కలసి 1960 జూలై 1న 'ఆంధ్రజ్యోతి' దినపత్రికను విజయవాడలో స్థాపించారు. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం సేవలందించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి ఆయన రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1987 జూలై 16న కన్నుమూశారు.

రమేష్ నాయుడు (జయంతి)



ప్రముఖ సంగీతదర్శకులలో ఒకరైన పసుపులేటి రమేష్ నాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా కొండపల్లిలో 1933 జనవరి 1న జన్మించారు. సంగీతంపై చిన్నప్పటి అపారమైన ఆసక్తిని పెంచుకున్న ఆయన బీఆర్ చోప్రా మార్గదర్శకత్వంలో సంగీత పరికరాలపై అవగాహన పెంచుకుని వాటిని వినియోగించడంలో శిక్షణ పొందారు. అనంతరం హెచ్ఎంవి మ్యూజిక్ కంపెనీ ఆర్కెస్ట్రాలో చేరారు. తెలుగు సినిమా రంగంలో తనదైన ముద్ర వేసుకున్నారు. బెంగాలీ, నేపాలీ, ఒరియా సినిమాలకు కూడా పదేళ్ళపాటు సేవలందించారు. 1983లో 'మేఘ సందేశం'కు ఉత్తమ సంగీత దర్శకుడిగా జాతీయ పురస్కారం అందుకున్నారు. 1987 సెప్టెంబరు 3న కన్నుమూశారు.

సోనాలి బెంద్రే (పుట్టినరోజు)



సోనాలి బెంద్రే 1975 జనవరి 1న ముంబైలో జన్మించారు. ఒక మోడల్‌గా తన కెరీర్‌ను ప్రారంభించిన ఆమె హిందీ సినీరంగంతో మరాఠీ, తెలుగు, తమిళ, కన్నడ భాషల సినిమాల్లో నటించారు. 19 ఏళ్ళ ప్రాయంలోనే ఆమె తన తొలి చిత్రానికి గాను ఫిలింఫేర్ పురస్కారాన్ని అందుకున్నారు. లెక్కకు మిక్కిలి అవార్డులు పొందారు. పలు కంపెనీలకు బ్రాండ్ అంబాసిడర్‌గా సేవలందించారు. 2017 నుంచి ఆమె సోనాలి బుక్ క్లబ్‌ను నిర్వహిస్తున్నారు. 2019లో జాతీయ స్థాయిలో ఉమెన్ అచీవర్ పురస్కారం పొందారు.

విద్యాబాలన్ (పుట్టినరోజు)



విద్యాబాలన్ 1979 జనవరి 1న బాంబేలో జన్మించారు. హిందీ సినిమా రంగంలో విలక్షణ పాత్రలను పోషించి తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు. తన అద్భుత నటనాకౌశల్యానికి గాను ఒకసారి నేషనల్ ఫిలిం అవార్డు, ఆరుసార్లు ఫిలింఫేర్ పురస్కారాలను అందుకున్నారు. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్‌లో సభ్యురాలు. యూటీవీ మోషన్ పిక్చర్స్ సీఈఓ సిద్ధార్థరాయ్ కపూర్‌ను వివాహమాడారు. సమాజసేవలతో ఖ్యాతి గడించారు. మహిళల సాధికారతకోసం ఎనలేని కృషి చేశారు. 2014లో 'పద్మశ్రీ' అందుకున్నారు.

డ్రోన్, ల్యాప్‌టాప్‌లకు రైతుల నిప్పు



కాలిపోయిన సర్వే ఉపకరణాలు



రైతులను నచ్చజెబుతున్న పోలీసు అధికారులు

దొమ్మసంద్ర, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకాలోని సర్జాపుర స్విఫ్టసిటీకి వ్యతిరేకంగా రైతుల ఆగ్రహం పెల్లుబికింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రైవేట్ సంస్థ సర్వే ప్రతినిధులు సోమవారం వచ్చిన వేళ సర్వేకోసం ఉద్దేశించిన డ్రోన్ కెమెరా, ల్యాప్‌టాప్‌లకు రైతులు నిప్పుపెట్టారు. కేఐఏడీబీ భూస్వాధీన ప్రక్రియను వ్యతిరేకిస్తూ ఏడాదిన్నరగా రైతులు నిరంతరం నిరసన వ్యక్తం చేస్తున్నారు. 15రోజులక్రితం భారీ బైక్ ర్యాలీ నిర్వహించి ప్రతిఘటన నిర్వహించారు. తాజాగా సోమవారం సర్వే ప్రక్రియను రైతులు అడ్డుకున్నారు. సూర్యసిటీ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సంజయ్ మహాజన్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. రైతులను నచ్చచెప్పేయత్నం చేశారు. సర్వేయర్లు తెచ్చిన ఉపకరణాలను కాల్చివేయడంపై డీఎస్పీ మోహన్‌కు సమాచారం ఇచ్చారు. రైతులు పట్టుబట్టడంతో జిల్లా అధికారికి ఫోన్ చేసి విషయాన్ని తెలపగా జనవరి 10న ఆనేకల్ తాలూకాకు విచ్చేసి రైతుల సమస్యలను ఆలకిస్తానని హామీ ఇవ్వడంతో నిరసన వీడారు.

అధికారుల తప్పుడు నివేదిక: రైతుసంఘం మండిపాటు

కాగా కేఐఏడీబీ తలపెట్టిన భూస్వాధీన ప్రదేశంలో రైతులు రాగి, కంది, వరి, పట్టు, పూలు, వివిధ కూరగాయలు పండిస్తున్నారు. పంటలపై ఆధారపడిన రైతుల జీవితాలకు ఇబ్బంది కలిగించేలా సారవంతమైన భూములను లాక్కోవాలని ప్రయత్నించడం సరికాదన్నారు. ఎన్నికల వేళ డీసీఎం డీకే శివకుమార్ రైతుల సమస్యలను ఆలకిస్తానని హామీ ఇచ్చి అనంతరం పట్టించుకోలేదని, తరచూ సర్వేయర్లు రావడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్విఫ్టసిటీకి వ్యతిరేకంగా జనవరి 4న సర్జాపురలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మైదానంలో రైతుల సమావేశం నిర్వహించదలిచారు. సారవంతమైన భూములను ఎటువంటి ఆధారంలేకుండా బీడు భూములుగా అధికారులు నివేదిక ఇచ్చారని ఆరోపించారు. జిల్లా అధికారి ఇచ్చిన హామీ మేరకు 10న సమావేశం నిర్వహించని పక్షంలో తీవ్ర పోరాటం చేస్తామని రాష్ట్ర రైతుసంఘం, హసిరుసేన తాలూకా అధ్యక్షుడు కేశవ్ తెలిపారు. నిరసనలో రైతు ప్రముఖులు చంద్రారెడ్డి, దినేశ్, నాగేశ్‌రెడ్డి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఎన్నిక

శిడ్లఘట్ట, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): శిడ్లఘట్ట తాలూకాలోని బశెట్టిహళ్ళి హోబళి ఆనేమడగు గ్రామ వ్యవసాయ సేవా సహకారసంఘం నూతన పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మంజునాథ్ తెలిపారు. సంఘం కార్యాలయంలో సోమవారం 12 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 12 మంది నామినేషన్లు వేయగా అందరినీ ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారన్నారు. వివిధ విభాగాలలో జయరామరెడ్డి, ఆంజనేయరెడ్డి, బైరారెడ్డి, నరసింహమూర్తి, లక్ష్మయ్య, నరసింహప్ప, సీ వెంకటేశప్ప, సోమశేఖర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, సుశీలమ్మ, చంద్రకళ, నరసింహప్పలు ఏకగ్రీవమైనట్టు తెలిపారు.

మార్కెట్‌లోకి సరికొత్త జనరేటర్లు

బెంగళూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మహీంద్రా అండ్ మహీంద్రా లిమిటెడ్ ఉత్పత్తుల అధీకృత ఉత్పత్తిదారుడు ఎస్కాన్ జెన్‌సెట్ కంపెనీ నుంచి సిపిసిబి 4+ జెన్‌సెట్‌లను విడుదల చేశారు. మహీంద్రా పవరోల్ జనరల్ మేనేజర్ సుమిత్‌గుప్తా, ఎస్కాన్ జెన్‌సెట్ ఎండీ ప్రశాంత్ దండానీయ బెంగళూరులో విడుదల చేశారు. డాబస్‌పేటలో ఉత్పత్తి చేసిన జెన్‌సెట్‌లు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కల్గిన కామన్ రేల్ డీజిల్ ఇంజిన్ ఉంది. ఇంధన సామర్థ్యం హెవీడ్యూటీకి అనుకూలంగా ఉంటూ కాలుష్యనియంత్రణ మండలి నిర్దేశించిన ప్రమాణాలకంటే తక్కువగా కాలుష్యం వెదజల్లేలా రూపొందించబడినట్టు తెలిపారు. జనరేటర్‌లకు సంబంధించిన ఫిర్యాదులు, ఇతర అంశాలకు సంబంధించి అన్ని చోట్లా వినియోగదారుల సేవా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ప్రకటనలో తెలిపారు.

నగరవ్యాప్తంగా టీడీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదులో అభిమానులు

బెంగళూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు నగరంలోని వివిధ ప్రాంతాలలో కొనసాగుతోంది. పార్టీ సభ్యత్వ నమోదు ముగింపు మంగళవారం కూడా జరిగింది. పీణ్యా పారిశ్రామికవాడ, జేపీ నగర్, యలహంక, జయనగర్‌తోపాటు వివిధ ప్రాంతాలలో పార్టీ అభిమానులు పాపణ్ణ, చన్నకేశవ, రెడ్డెప్ప, నాగార్జునతోపాటు పలువురు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పరిధికి చెందినవారు స్థానికంగా నివసిస్తున్నవారికి సభ్యత్వాలు చేశారు. రెండు జిల్లాల్లో ఓటరు కార్డు కల్గినవారికి సభ్యులుగా చేర్చారు. ఈ సందర్భంగా పాపన్న మాట్లాడుతూ.. తెలుగుదేశం సభ్యత్వం ద్వారా ప్రమాదబీమా వర్తిస్తుందన్నారు. సభ్యత్వ నమోదులో వెంకటరమణరెడ్డి, ఉత్తన్న, ఎల్లప్ప, నాగిరెడ్డి, కదిరి అశోక్, శ్రీరాములు, హేమారెడ్డి, శ్రీనివాసులు, మణికంఠ, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీ కొన్న బస్సు ముగ్గురి దుర్మరణం

బెంగళూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): బైక్‌ను బస్సు ఢీ కొన్న ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందారు. మంగళవారం ఉత్తరకన్నడ జిల్లా హొన్నావరలో కేఎస్ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనాన్ని ఢీ కొనడంతో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో విజయపుర నుంచి మంగళూరుకు వెళ్తున్న బస్సు, మంకి నుంచి హొన్నావర పట్టణానికి వెళ్తున్న బైక్‌ను ఢీ కొంది. ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న రాఘవేంద్ర సోమయ్యగౌడ (34), నంశి నివాసి గౌరీశ్‌నాయక్ (25), ఖర్వాకు చెందిన రమేశ్ నాయక (22) తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. హొన్నావర పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

ప్రియుడితో కలిసి భర్త హత్య

▸▸ హాసన్ జిల్లాలో ఘటన

బెంగళూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): జీవితకాలం కలసి ఉండాల్సిన భర్తను ప్రియుడితో కలసి కిరాతకంగా హత్య చేసిన భార్య ఉదంతం హాసన్ జిల్లాలో చోటు చేసుకుంది. అరసికెరె శివారులోని తిరుపతి క్రాస్ వద్ద హత్యకు గురైన వ్యక్తిని ముజామిల్‌గా గుర్తించారు. అతడి భార్యతోపాటు ప్రియుడు యాసిన్‌లు హత్యకు కారకులుగా గుర్తించారు. వివాహేతర సంబంధానికి ముజామిల్ అడ్డుగా ఉన్నాడని నిందితులు హత్యకు పాల్పడినట్టు పోలీసుల విచారణలో బహిరంగమైంది. భార్యాభర్తలు అన్యోన్యం గా ఉండేవారు. ఇటీవల ముజామిల్ భార్యతో యాసిన్‌కు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఇదే కారణంతో ఇంట్లో గొడవలు తలెత్తాయి. డిసెంబరు 15న మద్యం సేవించిన ముజామిల్‌ను అరసికెరె శివారు ప్రాంతానికి తీసుకెళ్లి తలపై బండరాయితో కొట్టి చంపారు. మృతదేహాన్ని సమీపంలోని ఓ డ్రైనేజీలో పడేశారు. మూడు రోజులపాటు వరుసగా మృతదేహంపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఆ తర్వాత గుజరీ వస్తువులతో డ్రైనేజీ కాలువ పైభాగాన్ని కప్పిపెట్టారు. రెండు రోజుల తర్వాత భార్యతోపాటు కుమారుడు జహీర్‌ఖాన్‌లు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ముజామిల్ కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత పోలీసులు వివిధ ప్రాంతాలలో గాలింపులు జరిపారు. కాలిపోయిన స్థితిలో ముజామిల్ మృతదేహాన్ని గుర్తించారు. భార్యను అదుపులోకి తీసుకుని విచారించడంతో వాస్తవం వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు ఇద్దరిని మంగళవారం అరెస్టు చేసినట్టు అరసికెరె పోలీసులు తెలిపారు.

ఎద్దుపై పడి రైతు మృతి

రామగిరి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా రామగిరి మండలంలోని అక్కంపల్లిలో మంగళవారం ఓ రైతు ఎద్దుపై పడి మృతిచెందాడు. నాగప్ప(64) ఆకు కోయడానికని చెట్టు ఎక్కాడు. అయితే చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు జారి కింద ఉన్న ఎద్దుపై పడ్డాడు. ఎద్దు కొమ్ములు పొడుచుకుని మృతిచెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

మంత్రి ప్రియాంక ఖర్గే ఇంటి ముట్టడికి బీజేపీ యత్నం



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

బెంగళూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): బీదర్ జిల్లా కాంట్రాక్టర్ సచిన్ ఆత్మహత్యకు బాధ్యత వహిస్తూ మంత్రి ప్రియాంక ఖర్గే రాజీనామా చేయాలని బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. నగరంలో మంత్రి ప్రియాంక ఖర్గే ఇంటి ముట్టడితోపాటు పోస్టర్లు అంటించే ప్రక్రియను పోలీసులు అడ్డుకున్నారు. హంతకులకు ప్రభుత్వం ప్రోత్సాహం, నీతిలేని ప్రభుత్వానికి వ్యతిరేకం అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి, అధికార ప్రతినిధి అశ్వత్థనారాయణ, ఎమ్మెల్సీలు రవికుమార్, సీటీ రవి, జగదీశ్, హిరేమని, ఉమేశ్‌శెట్టితోపాటు పలువురు పాల్గొన్నారు. పోలీసులు వారిని అడ్డగించి అరెస్టు చేశారు. కాగా బీజేపీ కలబురగిలో మంత్రి ఖర్గే ఇంటి ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించడంపై మంత్రి ధీటుగా స్పందించారు. కలబురగిలో నిరసన తెలిపేందుకు వచ్చేవారికి టీ, జ్యూస్ ఇస్తామని ఎద్దేవా చేశారు. కాగా కాంట్రాక్టర్ సచిన్‌నుంచి మేము డబ్బులు తీసుకోలేదని, అతడే మా నుంచి లక్షల రూపాయలు తీసుకున్నాడని మంత్రి ప్రియాంక ఖర్గే ఆప్తుడు రాజు కపనూరు సోదరుడు ప్రకాశ్ కలబురగిలో ప్రకటించారు.



తేజస్వీసూర్య శివశ్రీ స్కంద

ఓ ఇంటివాడు అవుతున్న ఎంపీ తేజస్వి సూర్య

బెంగళూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు దక్షిణ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య ఓ ఇంటివాడు అవుతున్నారు. రెండోసారి ఎంపీగా, భారతీయ జనతా యువమోర్చా జాతీయ అధ్యక్షుడిగా కొనసాగుతున్న తేజస్వీసూర్యకు గడిచిన ఆరేడేళ్లుగా పలు సభలు, సమావేశాలు, చర్చాగోష్ఠుల్లో పెళ్లి ప్రస్తావన వచ్చాయి. సున్నితంగా దాటవేసిన తేజస్వీసూర్యకు ఇటీవలే వివాహం కుదిరింది. చెన్నైలోని శివశ్రీ స్కందప్రసాద్‌తో పెళ్లి విషయం ఇరుకుటుంబాలు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. సివశ్రీ ప్రముఖ భరతనాట్య కళాకారిణిగాను, భక్తి గేయాల ఆలాపనలో పేరొందారు. శస్త్ర యూనివర్సిటీ నుంచి బయోఇంజనీరింగ్ పూర్తి చేసిన శివశ్రీ యూట్యూబ్ చానెల్‌కు 2లక్షలమంది ఫాలోయెర్స్, సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. మద్రాస్ యూనివర్సిటీ నుంచి భరతనాట్యంలో ఎంఏ, మద్రాస్ సంస్కృత యూనివర్సిటీ నుంచి సంస్కృతంలో ఎంఏ పూర్తి చేశారు. సైక్లింగ్, ట్రెక్కింగ్‌లోనూ ప్రవేశం ఉంది. మార్చిలో వీరి వివాహం జరగనున్నట్లు తెలుస్తోంది.

టమోటా కిలో రూ.7

అనంతపురం రూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.7 తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు.

ద్విచక్ర వాహనాల స్వాధీనం

బంగారపేట, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని బూదికోటె పోలీస్ స్టేషన్ పరిధిలో రూ.5.8 లక్షల విలువైన 7 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. బూదికోటె ఎస్సై సునిల్ ఐరోడగి మీడియాతో మాట్లాడుతూ డిసెంబరు 29న కొడగుర్కి క్రాస్ వద్ద గస్తీలో ఉండగా కదిరేనహళ్ళికి చెందిన ప్రవీణ్ అనే వ్యక్తి పల్సర్ ద్విచక్ర వాహనాన్ని తోసుకుని వెళ్తుండగా అనుమానంతో ఆరా తీయగా చోరీ ఘటనలు వెలుగు లోకి వచ్చాయన్నారు. నిందితుడి నుంచి సుమారు రూ.5.80 విలువైన 7 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కోర్టు ముందు హాజరు పరిచినట్టు తెలిపారు. కార్యాచరణలో పాల్గొన్న సిబ్బంది విజయకుమార్, అమరేశ్, ఎన్‌వి ప్రభాకర్, శ్రీకాంత్, చంద్రశేఖర్, మంజునాథ్ కార్యవైఖరిపై జిల్లా ఎస్పీ కేఎం శాంతరాజు ప్రశంసించారన్నారు.



స్వాధీనం చేసుకున్న వాహనాలివే...

మౌలిక సదుపాయాలను కల్పించండి

శిడ్లఘట్ట, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): శిడ్లఘట్ట తాలూకా కొత్తనూరు పంచాయతీ పరిధిలోని గూరమడుగు గ్రామంలో మౌలిక సదుపాయాల కొరత ఉంది. సరైన రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానికులు మునియప్ప, పాపణ్ణ, శ్రీరామప్ప తదితరులు మాట్లాడుతూ మురుగునీరు వెళ్లేందుకు కాలువ లేకపోవడంతో రోడ్డుపక్కనే ప్రవహిస్తోందన్నారు. వర్షాకాలంలో సమస్య తీవ్రంగా ఉంటోందన్నారు. మట్టిరోడ్లను సీసీరోడ్లుగా మార్చాలని, డ్రైనేజీ వ్యవస్థ కల్పించాలని కోరుతున్నారు. ప్రస్తుత మురుగునీటి కాలువ వల్ల దోమలబెడద అధికంగా ఉంటోందని గ్రామస్తులు వాపోతున్నారు. మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసి అందుబాటులోకి తేవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



మట్టిరోడ్డుపక్కనే కాలువ ఇలా...